


మొంథా తుపాన్ కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలి..

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

గురువారం | 30 అక్టోబరు , 2025 | పేజీలు : 06



# వర్షాలకు నీట మునిగిన ఎస్‌టి గురుకులం

500 మంది విద్యార్థులు, 26 మంది టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది అందరూ సురక్షిత ప్రాంతాలకు తరలింపు

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్‌పి




# గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు యువతను చైతన్యం చేయాలి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపు

మహాత్మా గాంధీ యూనివర్సిటీలో 'ఎంజాయి పేరుతో గంజాయి వద్దు' నాటక కళా ప్రదర్శన



**ప్రజాపక్షం/నల్లగొండ** : అనేక ప్రజాద్యమాలకు కీలక పాత్ర పోషించిన యూనివర్సిటీ విద్యార్థులు సామాజిక రుగ్మతలకు మూల కారణమైన గంజాయి, డ్రగ్స్ నిర్మూలించేందుకు ప్రజలను,విద్యార్థి యువతను చైతన్యం చేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజా నాట్యమండలి నేతృత్వంలో చేపట్టిన ఎంజాయ్ పేరుతో గంజాయి వద్దు బస్సు కళా జాత బుధవారం మహాత్మా గాంధీ యూనివర్సిటీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఒకసారి డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితాలు నాశనం అవుతాయని, ఆ వ్యవసం నుంచి బయటపడడం చాలా కష్టమని, వ్యసనాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. ఈ వ్యసనాలు ఆర్థిక విధ్వంసాన్ని సృష్టిస్తుందని, పర్యావరణానికి నష్టం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరంలో అతి కొద్ది మంది సంపన్నులకే పరిమితమైన గంజా యి ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలలో కిరాణం షాప్‌లలో చాక్లెట్ రూపంలో రావడం దురదృష్టకరమన్నారు. వీటి నిర్మూలనకు విస్తృతమైన ప్రచారం కోసం బస్సు కళాజాత చేపడుతున్న ప్రజా నాట్య మండలిని ఆయన అభినందించారు. యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగుతూ సామాజిక రుగ్మతల రూపుమాపుటలో క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో,తెలంగాణ సాంస్కృతిక సలహా మండలి సభ్యులు,ప్రజా నాట్యమండలి ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, రాష్ట్ర అధ్యక్షులు కె శ్రీనివాస్, ఎఐఎస్ఎఫ్ యూనివర్సిటీల కన్వీనర్ రెహమాన్, జిల్లా అధ్యక్షుడు ముదిగొండ మురళి కృష్ణ, శాంతి సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య, ఎంజియూ అధ్యాపకులు డాక్టర్ మారం వెంకటరమణారెడ్డి,డాక్టర్ అనిత కుమారి,డాక్టర్ ఆనంద్, డాక్టర్ ఏ మధు తదితర అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.అనంతరం డ్రగ్స్ బారిన పడు తున్న విద్యార్థులు ఆ కుటుంబ పరిస్థితులపైన ప్రదర్శించిన వీది నాటకం విద్యార్థులను ఎంతో ఆకట్టుకున్నది.

# వడపర్తిలో గొర్రెలు అపహరణ..

పోలీస్‌లకు ఫిర్యాదు చేసిన బాధితులు



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : గుర్తు తెలియని దుండగులు గొర్రెలను అపహరించుకపోయారు. ఈ సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భువనగిరి మండలం, వడపర్తి గ్రామానికి చెందిన మెడబోయిన మహేష్, మెడబోయిన బాలయ్యతో కలిసి గొర్రెల కాపరి వృత్తితో పాటు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. తమ గొర్రెల మందను గ్రామ శివారులోని మేతకు తీసుకెళ్లి, సాయంత్రం సమయంలో తిరిగి తమ వ్యవసాయ భూమిలో ఉన్న గొర్రెల షెడ్‌లో తొలారు. అనంతరం వారు వ్యవసాయ బావికి వెళ్లి పాలను పిండుకొని, రాత్రి సుమారు 19:30 గంటలకు ఇంటికి వెళ్లారు. బుధవారం ఉదయం సుమారు 05:00 గంటలకు గొర్రెల షెడ్‌కు వెళ్ళి చూసే సరికి మొత్తం 45 గొర్రెలు కనిపించలేదు. వెంటనే చుట్టుపక్కల వెతికినా ఆ గొర్రెలు దొరకలేదు. అనంతరం గొర్రెల షెడ్ వద్ద ఉన్న సీసీటీవీ ఫుటేజీ పరిశీలించగా రాత్రి 19:50 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని దొంగలు గొర్రెలను దొంగలించినట్లు ఫుటేజీలో గమనించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ ఎం.అనిల్ కుమార్ తెలిపారు.

## దుండగులను వెంటనే పట్టుకోవాలి

భువనగిరి మండలం వడపర్తి గ్రామంలో గొర్రెలను అపహరించుకపోయినా దుండగులను వెంటనే గుర్తించి పట్టుకోవాలని శ్రీ కృష్ణ యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్ట వీరేష్ యాదవ్ అన్నారు. బుధవారం వడపర్తిలో గొర్రెల కాపరి మేడబోయిన బాలయ్య యాదవ్ గొర్రెల మంద దగ్గరికి వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వారి కుటుంబాన్ని ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నలుగురు గుర్తు దుండగులు వారి యొక్క గొర్రెల మందలో చొరబడి సుమారు 100 గొర్రెలను ఎత్తుకుపోయారని చెప్పారు. దీనికి సంబందించిన దృశ్యాలు సోలార్ సిసి కెమెరాలో నమోదు అయ్యాయని, దాదాపు 10 లక్షల ఆస్తి నష్టం జరిగిందన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుండి 10 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ యాదవ సంఘం జిల్లా నాయకులు నక్కల చిరంజీవి యాదవ్, భువనగిరి పట్టణ అధ్యక్షులు మరి పాండు యాదవ్, జిల్లా యూత్ అధ్యక్షులు రమేష్ యాదవ్ పాల్గొన్నారు.

# మైనర్ పిల్లలను అమ్మడం, కొనడం చట్టరీత్యా నేరం

బేబీలను అక్రమ దత్తత చేసిన ఏడుగురు వ్యక్తులు అరెస్ట్.. రిమాండ్

జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ వెల్లడి



## చేపల వేటకు వెళ్ళి కృష్ణానదిలో చిక్కుకుపోయిన జాలరి శ్రీను

**ప్రజాపక్షం/చింతలపాలెం** : మండలంలోని పులిచింతల ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ పాత వెల్లటూరు గ్రామ సమీపంలో మంగళవారం ఉదయం పరసగాని శ్రీను వెల్లటూరు వాసి చేపల వేటకు కృష్ణానదిలోకి వెళ్ళాడు. పడవ ఇంజన్ చెడిపోవడంతో తిరిగి ఇంటికి రాలేక పాత వెల్లటూరుకి ఎదురుగా ఉన్న అవతలి ఒడ్డు వైపున ఉన్న పరిస్థితి ఏర్పడ్డది. తుఫాన్ కారణంతో అలలు రావడంతో అటువైపుగా ఏ ఇతర జాలర్లు రాకపోవడంతో ఇంటికి తిరిగిరాలేని పరిస్థితి రెండు రోజుల నుండి ఏర్పడ్డదని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయాన్ని పోలీసు సిబ్బందికి తెలియజేయాలని మీడియాను కోరారు.

## శునకం గొంతులో ఇరుక్కున్న ఎముకను తొలగింపు



**ప్రజాపక్షం/ కోదాడ:** పట్టణ పరిధి ఆజాద్‌నగర్‌కు చెందిన ఎం. విజయ్ పెంపుడు శునకం గొంతులో మంగళవారం ఎముక ఇర్కుని బాధతో విల,విలాడుతుంది. దగ్గరుక పోయిన యజమానిని సైతం కరవడంతో దగ్గరకు పోయేందుకు భయంపడారు. బుధవారం ధైర్యం చేసి నాలుగురు వ్యక్తులు తాళ్లతో బంధించి కోదాడ ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పి.పెంటయ్య మత్తు ఇంజక్షన్ ఇచ్చి శునకం గొంతులోని ఎముకను తొలగించారు. ఈ ఆపరేషన్‌లో సిబ్బంది చంద్రకళ పాల్గొన్నారు.

## పశువైద్య సేవలు అభినందనీయం



**ప్రజాపక్షం/ కోదాడ:** కోదాడ ప్రాంతీయ పశువైద్యశాల అధకారులు అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా పశువైద్య, పశుసంవర్ధశాఖ అధికారి డి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం కోదాడ ప్రాంతీయ వైద్యశాలను ఆయన సందర్శించి మాట్లాడుతూ పశుపోషకులకు ఆసరాగ నిలుస్తున్న పశు ఔషద బ్యాంకు ద్వారా సంవత్సరానికి 3.6 కోట్ల రుపాయాలు అదనపు సంపద సృష్టించిడం తమ డిపార్టుమెంటు చరిత్రలో ఒక మైలురాయి అని కోనియాడారు. అనంతరం కార్యలయ రికార్డులు పరిశీలించారు. అధికారులు తుఫాను సమయంల అప్రమత్తంగా ఉండాలని సేవలకు సిబ్బంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డా॥ పి.పెంటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## సాధన సదస్సును జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ 9వ షెడ్యూల్లో చేర్పించాలని డిమాండ్ చేస్తూ జరుగుతున్న ఉద్యమంలో భాగంగా నవంబర్ 1న హైదరాబాద్‌లో జరిగే సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ యువజన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు నారబోయిన కిరణ్, జనసమితి జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ గౌడ్‌లు కోరారు. బుధవారం పట్టణంలో సదస్సు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి వారు మాట్లాడారు. దశాబ్దాల పాటు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ కేవలం భౌతిక సరిహద్దుల కోసం మాత్రమే కాదన్నారు. సామాజిక ఆర్థిక రాజకీయ సమానత్వ సాధన కొరకు సామాజిక ప్రజాస్వామ్య తెలంగాణ నిర్మాణం కొరకు సంపద, విద్య ఉద్యోగ రాజకీయ అవకాశాలు అందరికి అందించుట కొరకు అన్నారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వం ఆ వైపుగా ప్రయత్నాలు చేయకపోగా బిసిలకు ఉన్న రిజర్వేషన్లను తగ్గించిందని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలకు న్యాయం జరిగేందుకు ఇచ్చిన న్యాయపరమైన బిల్లుకు రక్షణ దొరకాలంటే రాజ్యాంగ సవరణ ద్వారా షెడ్యూల్ తొమ్మిదిలో చేరుస్తూ పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం బిల్లును ప్రవేశపెట్టి చట్టం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సామాజిక తెలంగాణ నిర్మాణంలో ఈ రిజర్వేషన్లు ఒక అడుగు వేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బచ్చలకూరి గోపి, వీరేష్ నాయక్, భాషబోయిన వేణురాజు, ఫర్‌యుద్దీన్, జెడ్మెల మునిష్ నాయుడు, ప్రవీణ్, విష్ణు, పవన్ పాల్గొన్నారు.

## భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండండి



**ప్రజాపక్షం/మోటకొండూర్** : మోంథా తుపాను ప్రభావంతో రాగల 24 గంటలలో బారీ నుంచి అతి బారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మోటకొండూర్ మండల పరిధిలోని వివిధ గ్రామాలలోని ప్రజలు అత్యవసరమైతే తప్ప ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరు బయటకు రాకూడదని ఎస్ఐ దేశెట్టి అశోక్ మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శిథిలవైన భవనాల్లో ఉండవద్దని విద్యుత్ వైర్లు, ట్రాన్స్ఫార్మర్లు, మోటర్లు స్తంభాలను తాకవద్దని ప్రజలకు రైతులకు సూచించారు. వర్షాల ప్రభావంతో చెరువులు కుంటలు లోతాట్టు ప్రాంతాలు జలమయమయ్యే అవకాశం ఉన్నందున చిన్నారులను వృద్ధులను ఒంటరిగా బయటకు పంపించవద్దని అన్నారు. వర్షాలతో చెరువులు కుంటలు నిండి ప్రవహిస్తున్నందున ప్రజలందరూ పోలీసుల సూచనలతో తమ కుటుంబాల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. వర్షపునీరు రోడ్లపై పారుతున్నందున వేగంగా డ్రైవ్ చేయవద్దని, అత్యవసర సందర్భాల్లో 100/112కి కాల్ చేయాలి.

### వర్షాలకు కూలిన ఇల్లు

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు ప్రజలకు ఇబ్బందులను తెచ్చిపెడుతున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో నేతికార్ మమత శ్రీనివాస్‌ల ఇల్లు గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలవలన మట్టితో నిర్మించిన ఇల్లు గోడలు తడిసి కూలిపోవడంతో ఇంట్లో ఉన్న నిత్యవసర వస్తువులు, దుస్తులు పూర్తిగా తడిసిపోయాయి. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఈ సమాచారం తెలుసుకున్న ఆర్ఐ జుబేరుద్దీన్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని కూలిపోయిన ఇల్లు తక్షణ సాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట జూనియర్ అసిస్టెంట్ వెంకటేష్ ఉన్నారు. చేయాలని ఎస్ఐ దేశెట్టి అశోక్ తెలిపారు.

## ఎకరాకు రూ.35వేలు నష్టపరిహారం చెల్లించాలి




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్** : మోంతా తుఫాన్‌తో పంటలు ఆగమాగం అయి రైతాంగం తీవ్రంగా నష్టపోయారని, నష్టపోయిన ప్రతి ఎకరాకు రూ.35వేల నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటి సభ్యులు పల్లె వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హుజూర్‌నగర్ పరిసర ప్రాంతాల్లో తుఫాన్‌కు నీటమునిగిన, నేలమట్టమైన పంట పొలాలను రైతు సంఘం, ప్రజాసంఘాల బృందంతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీట మునిగిన పొలాలను చూస్తుంటే కడుపు తరుక్కుపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వానాకాలం నాట్లు వేసింది మొదలు నిన్న మొన్నటి వరకు యూరియా కొత్తతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న రైతాంగం అష్టకష్టాలు పడి పంటలను కాపాడుకునేందుకు తీవ్రంగా శ్రమించారన్నారు. తీరా 15, 20 రోజుల్లో పంటలు చేతికొస్తుందన్న దశలో తుఫాన్‌తో రైతు ఆశలు నీరుగారిపోయాయన్నారు. పంట పొలాలను పరిశీలించిన వారిలో కౌలు రైతుల రాష్ట్ర కమిటి సభ్యులు దుర్గి బ్రహ్మం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హుస్సేన్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శీలం శ్రీను, నాయకులు రేపాకుల మురళీ, పాశం వెంకటనారాయణ, చిన్నం వీరమల్లు తదితరులు పాల్గొన్నారు.

## వాగులు పొంగి రాకపోకలు బంద్



**ప్రజాపక్షం/మోతె** : బుధవారం మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో సుమారు 61.5 మీల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావడంతో మండల పరిధిలోని నర్సింహాపురం బ్రిడ్జి వద్ద విభాళాపురం వాగులు పొంగిపొర్లడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. విభాళాపురం గ్రామం నుండి ఏ ఒక్కరు బయటకు రావద్దని తుమ్మగూడెం గ్రామం, నేరేడువాయి, గోపతండ, నర్సింహాపురం, రంగాపురం గ్రామాల నుండి వచ్చిపోయే వాహనదారులు వర్షాలు తగ్గే వరకు వాగాలు పూర్తిగా నీటి వరద ఆగిన తర్వాతే ప్రజలు ప్రయాణాలు చేయాలని మండల తహశీల్దార్ యం వెంకన్న, ఎంపిడిఓ ఆంజనేయులు, ఎస్ఐ అజయ్‌కుమార్‌లు ప్రజలకు సూచించారు. వర్షాల కారణంతో ప్రమాదాలు సంభవిస్తే వెంటనే కంట్రోల్ రూమ్ నంబర్ 6281492368 కి సహాయం కోసం ఫోన్ చేయాలని కోరారు. రైతులు తమ ధాన్యం తడిసిన సమాచారాన్ని అందించాలని తెలిపారు.

## పంటలకు నష్ట పరిహారం అందించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నల్లగొండ జిల్లా వ్యాప్తంగా తుఫాన్ ప్రభావంతో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో చేతికొచ్చిన పంటలు నీటిపాలై అన్నదాతలు కన్నీటి పర్యంతం అవుతున్నారని, నీటి పాలైన పంటలకు నష్ట పరిహారం అందించాలని సీఎం రేవంత్‌రెడ్డికి లేఖరాసి మెయిల్ ద్వారా పంపినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోత దశకు వచ్చిన వరి పంట నేల వారుతుండగా పత్తి తడిసి ముద్దయి రంగు కోల్పోతుందని ఆరుగాలం కష్టించి రైతులు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పంట కోసం ఎదురు చూస్తున్నారని పంట చేతికి వచ్చే సమయానికి ఇలా జరగడంతో రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా రాలేని పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం తడిసిన ధాన్యానికి మద్దతు ధర కల్పించడంతోపాటు నీటిపాలైన వరి పంటలకు నష్ట పరిహారం అందించాలని కోరారు.

## శిశు విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** శిశు విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీడీపీవో మమత హెచ్చరించారు. గాంధీనగర్ సెక్టార్ పరిధి మొదటి బిడ్డ పుట్టి రెండవసారి గర్భిణీగా ఉన్న వారి గృహాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీలు పోషక విలువలు గల పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా రక్తశాతం అధికంగా ఉండేలా చూసుకోవాలన్నారు. తల్లిపాలు శ్రేష్టమైనవని బిడ్డ పుట్టిన గంటలోపు తప్పనిసరిగా ముర్రుపాలు పట్టించాలన్నారు. ఇటీవల శిశు విక్రయాలు వెలుగు చూస్తున్నాయని, అది తీవ్రమైన నేరమన్నారు. శిశు విక్రయాలకు పాల్పడినా, ప్రయత్నించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పాప, అయినా బాబు అయినా తల్లిదండ్రులు సమానంగా చూడాలని, లింగ వివక్ష చూపవద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నజీమా, బ్లాక్ కోఆర్డినేటర్ కవిత, టీచర్ పాల్గొన్నారు

## గోదావరిలో అస్థికలు నిమజ్జనం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అస్తికలను గోదావరి నదిలో ఆయన కుమారుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి నిమజ్జనం చేశారు. బుధవారం భద్రాచలం క్షేత్రంలోని గోదావరి నదిలో కుమారుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డితో పాటు కుటుంబ సభ్యులు అర్చకుల వేదమంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా గోదావరి నదిలో నిమజ్జనం గావించారు. ఈ కార్యక్రమంలో దామోదర్ రెడ్డి సోదరులు గోపాల్ రెడ్డి, కృష్ణారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్, శ్రీదండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగెళ్ళ కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## మొంథా అంతా ముంచ్చింది

**ప్రజాపక్షం/అడ్డగూడూరు** : మొంథా తుపాను రైతాంగంను మొత్తం ముంచేసింది.బుధవారం ఉదయం నుండి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి రైతులు తీవ్రంగా నష్టపోయిన ఆందోళన చెందుతున్నారు. పత్తి తడిసి ముద్దైంది.వరి పంటనేలకు వాలి నీటిలో మునిగింది ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఆరబెట్టినా ధాన్యం తడిసి పోయాయి రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.వాగులు పొంగి పొర్లుతున్నాయి. చెరువులు అలుగులు పోస్తున్నాయి.

## వర్షాల కారణంగా గ్రీవెన్స్ కార్యక్రమం రద్దు

**ప్రజాపక్షం/యాదాద్రి :** భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రతి గురువారం ప్రజల సమస్యలను పరిష్కరించే గ్రీవెన్స్ కార్యక్రమంను రద్దు చేయడం జరిగిందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు ఒక ప్రకటనలో తెలిపారు. కావున జిల్లాలోని ప్రజలు భారీ వర్షాలు కురుస్తున్నందున, ప్రజలు కలెక్టరేట్‌కు వచ్చి ఇబ్బందులు పడవద్దనే ఉద్దేశంతో ఈ గ్రీవెన్స్‌ను రద్దు చేయడం జరిగిందని, తదుపరి వచ్చే గురువారం గ్రీవెన్స్ యధాతథంగా ఉంటుందని అన్నారు.

## కల్లుగీత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శిగా బాలరాజు

**ప్రజాపక్షం/ రామన్నపేట:** జిల్లా కల్లుగీత కార్మిక సంఘం 4వ మహాసభలు చౌటుప్పల్ ఎంఎస్‌రెడ్డి గార్డెన్‌లో రాగీరీ కృష్ణయ్య, మద్దెల రాజయ్య, ధూపాటి వెంకటేష్ అధ్యక్షవర్గంగా జరిగిన మహాసభలో ముఖ్య అతిధులుగా కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ, కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు పాల్గొని వృత్తిని ఆధునీకరించి నీరా తాటి ఈత ఉత్పత్తులను ప్రోత్సహించి యువతీ, యువకులకు ఉపాధి కల్పించాలని కోరారు. రామన్నపేటకు చెందిన బావండ్లపల్లి బాలరాజును జిల్లా సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## తెలంగాణ రాష్ట్ర కుమ్మర మండల నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండల కేంద్రంలో 10 గ్రామాల కమిటీల సర్వ సభ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్రకుమ్మర సంఘం నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా చిలువేరు బిక్షపతి (లారీ)మండల అధ్యక్షుడిగాచిలువేరు సైదులును, ఉపాధ్యక్షులుగా చిలువేరు యాదయ్య, ప్రధాన కార్యదర్శిగా చిలువేరు బిక్షపతి, కోశాధికారిగా కొత్తపెల్లి యాదయ్య, మరి కొంతమందితో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సైదులు మాట్లాడుతూ వృత్తి హక్కుల కోసం సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తానని అన్నారు. తన ఎన్నికలకు సహకరించిన కుల సంఘ నాయకులకు కేహెచ్‌పిఎస్ వ్యవస్థాపకులు చిలువేరు అంజయ్య, జిల్లా నాయకులకు రాజు, దరిపెల్లి ప్రవీణ్, కుల సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రైతులను ఆదుకోవాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్ర వ్యాప్తంగా తుఫాన్ ప్రభావంతో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో చేతికొచ్చిన పంటలు నీటి పాలై అన్నదాతలు కన్నీటి పర్యంతం అవుతున్నారని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు. అప్పులు చేసి సాగు చేసిన వరి, పత్తి పంటలు చేతికొచ్చే సమయంలో తుఫాను ప్రభావంతో నేలరాలి పోతుందని, దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. నష్టపోయిన రైతులను ఆదుకోకపోతే రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందని కావునా ప్రభుత్వం నష్టపోయిన రైతులందరిని ఆదుకోవాలని కోరారు.




# అధికారులందరు అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మొంథా తుఫాను ప్రభావంతో విస్తారంగా కురుస్తున్న వర్షాల దృష్ట్యా అన్ని శాఖ అధికారులందరు అప్రమత్తంగా ఉండి సమన్వయంతో కలిసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. బుధవారం కురిసిన ఎడతెరపి లేని వర్షంతో దేవరకొండ మండలం కొమ్మేపల్లి గ్రామంలో గిరిజన బాలుర గురుకుల పాఠశాల చుట్టూ నీరు చేరడంతో పరిశీలనకు వెళుతున్న కలెక్టర్ కొండమల్లేపల్లిలో నల్గొండ రోడ్డు సంత బైపాస్ వద్ద వరద నీరు ఉధృతంగా వస్తుండడంతో వాహన దారులకు, గౌరికుంట తండా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా డివైడర్‌ను జేసిబితో తొలగింపచేయాలని అధికారులకు సూచించడంతో అప్రమత్తమైన అధికారులు డివైడర్‌ను తొలగించడంతో వరద నీరు వెళ్ళిపోవడం జరిగింది. వర్షాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలు ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకోని కాజ్‌వేలు,రహదారులు, బ్రిడ్జిపై ప్రయాణించవద్దని సూచించారు. వర్షం వలన తడిసి పడిపోయేందుకు అవకాశం ఉన్న కరెంటు స్థంభాలను ముట్టుకోవద్దని, కూలీపోయే ఇండ్లలో కూడా ఉండవద్దని సూచించారు. వర్షాల వలన ఇబ్బందులు తలెత్తినట్లయితే జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నెంబర్ 1800 425 1442లకు ఫోన్ చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రమణారెడ్డి, తహశీల్దార్ నరేందర్, ఎంపివో సుధీర్‌కుమార్, సీఐ నవీన్‌కుమార్, ఎస్ఐ అజ్మీర రమేష్, ఈవో డాకునాయక్ తదితరులు ఉన్నారు.

## ప్రతి ఒక్కరూ సేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి




**ప్రజాపక్షం/చండూరుః** ఓటు హక్కు కలిగియున్న ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సమాచార హక్కు పరిరక్షణ సమితి,ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు పిలుపునిచ్చారు. బుధవారం బుధవారం జూబ్లీహిల్స్ లోని ఓజోన్ యూనివర్సిటీ ప్రాంగణంలో సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించన ఓటరు అవగాహన ర్యాలీ సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో ఎన్నికలు కీలకం అని అన్నారు. అలాంటి సమయంలో హైదరాబాద్‌లో ఏ ఎన్నికలు వచ్చినా ఓటింగ్ శాతం తక్కువ ఉంటుందని అన్నారు. చదువుకున్న వారు ఓటు వేసేందుకు దూరంగా ఉంటున్నారన్న అభిప్రాయం మేరకు ప్రజల్లో ఉన్న అభిప్రాయాన్ని తొలిగించేందుకు జూబ్లి హిల్స్ ఉపఎన్నిక చక్కని అవకాశమన్నారు. ఎన్నికల కమీషన్ ఎంతో వ్యయ ప్రయాసాలతో నిర్వహించే ఎన్నికల విషయంలో ఓటు హక్కు వినయోగించుకునే బాధ్యత పౌరురుగా మనపైన ఉందన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకొని సమాజానికి ఉపయోగపడే మంచి అభ్యర్థిని ఎన్నుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంతోష్ ,కృష్ణ, నరేందర్ ,శ్వేత, విద్య, శ్రీదేవి, ప్రత్యూష, మేఖల శ్రీహరి, మేటు మధు, పోతరబోయిన సాయికృష్ణ ,స్వప్న ,ప్రవళిక ,వాక్సేను తదితరులు పాల్గొన్నారు.

## రోజంతా ముసురు..



**ప్రజాపక్షం/ హాలియా:** మొంథా తుఫాను దాటికి ప్రజలు, రైతులు విలవిల్లాడుతున్నారు. ఈ తుఫాను కారణంగా బుధవారం అంత ఎడతెరిపిలేని వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వర్షంతో భారీ వృక్షాలు నేలమట్టమయ్యాయి. కోతకు వచ్చిన పంట పొలాలు నీట మునిగాయి. భారీ ఈదురుగాలులకు హాలియా పరిధిలోని మదారి కూడా వెళ్లే దారిలో భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న హాలియా మున్సిపల్ కమిషనర్ రామ దుర్గారెడ్డి తమ సిబ్బంది తో కలిసి రోడ్డుకు అడ్డంగా పడిన వృక్షాన్ని తొలగించేందుకు తీవ్రంగా కష్టపడ్డారు. బుధవారం కురిసిన వర్షం దాటికి మండలంలో దాదాపు 5 నుంచి పదివేల ఎకరాల పంట నీట మునిగింది. అహల్య వాగుకు ఇరువైపులా ఉన్న పంట పొలాలు పూర్తిగా వరద నీటిలో తేలియాడాయి. ఇబ్రహీంపేట గ్రామ పరిధిలోని అలీ నగర్ వద్ద ప్రధాన జాతీయ రహదారి పై నీరు చేరి చిన్న పాటి వాగును తలపించింది. ప్రస్తుతం నీటిలో తేలియాడుతున్న పంటలను రెవెన్యూ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంగా ఏర్పడి క్షేత్ర స్థాయిలో పర్యటించి దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించేలా తక్షణ స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ధాన్యం తడవకుండా రైతులు కాపాడుకోవాలి



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** మొంథా తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక తహసిల్దార్ ఎల్ వెంకటేశ్వర్ రావు సందర్శించి అట్టి సెంటరించార్జకు, రైతులకు సూచనలు తెలియజేశారు. రైతులకు భద్రపరుచుకోవాలని సెంటర్ ఇన్చార్జిలకు రైతులకు కావలసిన సదుపాయాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ వర్షాల వల్ల అవసరమైన అవసరం మేరకే బయటికి రావాలని లేకుంటే ఇండ్లలోనే ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐకే.వి తరుణ్ పాల్గొన్నారు.



## ఉద్ధృతంగా ప్రవహిస్తున్న మూసినది

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** బీబీనగర్ పోచంపల్లి మధ్యగల రుద్రవెల్లి లోలెవెల్ బ్రిడ్జిపై మూసీ నది ఉద్ధృతంగా ప్రమాద కరస్థాయిలో ప్రవహిస్తుంది. మొంథ తుఫాన్ ప్రభావంతో కొన్ని రోజులుగా జంట నగరాలు, ఎగువన ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో మూసీ నదికి వరద పోటెత్తింది. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు అప్రమత్తమై అనుక్షణం పర్యవేక్షిస్తూ బ్రిడ్జికి ఇరువైపలా భారీ కేడ్లను ఏర్పాటు చేసి రాకపోకలను నిలిపివేశారు. ప్రజలు ఎవరు కూడా నదులు దాటే ప్రయత్నాలు చేయవద్దని ప్రత్యమ్నాయ మార్గాలను ఎంచుకొని తమ ప్రయాణాలను చూసుకోవాలని సూచించారు. బ్రిడ్జి వద్ద పోలీసులను కాపలా ఉంచారు. తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తమవటమే కాక రైతులు వరి పంటను కోసి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్ద పోసుకొని బిక్కు బిక్కుమంటు గడుపుతున్న సంగతి తెలిసిందే. పోచంపల్లి తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి ,రెవెన్యూ ఇన్స్పెక్టర్ గుత్తా వెంకట్ రెడ్డి పోలీస్ ఎస్సై భాస్కర్ రెడ్డి పోలీస్ శాఖ సిబ్బంది సమన్వయంతో ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులను తెలుసుకొని ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

## ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి ఆరోపించారు. బుధవారం నల్లగొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలు శ్రమించి పండించిన వరి ధాన్యం కొనుగోలులో అధికారులు నిర్లక్ష్యం విడనాడాలని కలెక్టర్ ను కోరారు. ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాలకు విపరీతంగా ధాన్యం వచ్చిందని ధాన్యం కొనుగోలు మందకొడిగా కొనసాగుతుందని భారీ వర్షాలతో ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులకు కనీసం టార్పాలిన్లు కూడా సప్లై చేయలేని పరిస్థితిలో అధికారులు ఉన్నారని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో దాన్యం కాటా పెట్టే విషయంలో అధికారుల నిబంధనలు పాటించడం లేదని, బస్తాతూకానికి గాను 40.600 కిలోలు తూకం వేయాల్సి వుండగా 1.కిలో అదనంగా 41.600 కిలోలు కాటావేస్తూ, రైతులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు.

## రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మెంతా తుపాన్ ప్రభావంతో గత కొన్ని రోజులుగా కురుస్తున్నా భారీ వర్షాల వల్ల మండల వ్యాప్తంగా వరి, పత్తి పంటలు పాడైపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు వెంటనే పంటనష్టపోయిన రైతులకు నష్ట పరిహారన్ని చెల్లించి వారిని ఆదుకోవాలని మర్రిగూడ మాజీ ఎంపీపీ బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అనంత రాజుగౌడ్ కోరారు. బుధవారం రోజున అతను స్థానికంగా మాట్లాడుతూ చెమటోడ్చి పండించిన పంట చేతుకోస్తుందనుకునే సమయంలో ఇలా అర్థతరంగా వర్షాల బారిన పడి పంటలు పూర్తిగా పాడైపోవడంతో రైతులు ఎంచేయాలో దిక్కుతోచని పరిస్థితులో ఉన్నారని అన్నారు. రైతులది పంట పండితే గాని డొక్కాడని పరిస్థితులు కావున రైతులయందు దయఉంచి ఇరు ప్రభుత్వాలు సంబంధిత అధికారులతో మండల వ్యాప్తంగా నష్టపోయిన పంటలను అంచనావేసి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని పేర్కొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/చండూరుః** మొంథా తుఫాన్ ప్రభావం వలన మరో రెండు రోజులు భారీ వర్షాలు ఉంటాయన్న వాతారణశాఖ సూచన మేరకు చండూరు మున్సిపాలిటీ ప్రజలు అప్రమతంగా ఉండాలని కాంగ్రేస్ పార్టీ చండూరు మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్ గౌడ్ చండూరు ప్రజలకు సూచించారు. శిథిలావ్యస్థలో ఉన్న ఇండ్లలో ఉన్న వారు వెంటనే మున్సిపల్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. మంగళవారం సాయంత్రం ఉండి ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వలన రహదారిపై వెళ్లే వారు జాగ్రతగా వెళ్లాలని, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని సూచించారు. మున్సిపాలిటీ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలన్నారు.

# మొంథా తుపాన్‌తో ఆగమాగం



ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; మొంథా తుఫాను ప్రభావం కారణంగా నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి పట్టణంతో పాటు పరిసర గ్రామాలలో చెరువులు, కుంటలు నిండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మంగళవారం రాత్రి నుండి ఎడతెరపిలేకుండా కురిసిన వర్షాలకు మండల పరిధిలోని మత్ర్యతండా నుండి కొల్‌ముంతల్‌పహాడ్‌కు వచ్చే దారిలో కాజ్‌వేపై ఉధృతంగా వరద రావడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడి తండా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నల్లకుంట నిండడంతో ఆ ప్రాంతంలో నిర్మించిన ఇండ్లలోకి నీరు రావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. శివజ్యోతినగర్, తిరుమలనగర్‌లోకి కుంట నీరు ఎడతెరపిలేకుండా రావడంతో కాలనీల వాసులు కొంత ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఇండ్లలోకి చేరిన నీటితో గౌరికుంట తండా వాసులు పుట్టేడు దుఖంతో ఉన్నారు. ఏవైన సమస్యలు తలెత్తినట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ అజ్మీర రమేష్ కోరారు.

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాపక్షం/అర్వపల్లి : మొంతా తుఫాన్ మూలంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల మూలంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్‌డిఓ వేణుమాధవరావు అన్నారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలోని చెరువులు, కుంటలను ఇరిగేషన్ అధికారులు పర్యవేక్షించి తెగిపోకుండా ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. ఆయన వెంట తహశీల్దార్ బి శ్రీకాంత్, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.

## రైతులు, ప్రజలకు అవస్థలు

ప్రజాపక్షం/హుజూర్‌నగర్ : మొంతా తుఫాన్ ప్రభావంతో మంగళవారం రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతో రైతులు, సామాన్య ప్రజలు చాలా రకాల అవస్థలు పడుతున్నారని భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు కొండ హరీష్ గౌడ్ అన్నారు. హుజూర్‌నగర్‌లోని బిజెపి కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రజాపక్షం/చివ్వెంల : మొంతా తుఫాన్ ప్రభావంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో చివ్వెంల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ మహేశ్వర్ బుధవారం ఒక ప్రకటలో కోరారు. మండల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పోలీసు వారి సూచనలను తప్పక పాటించాలని సూచించారు.

## నీట మునిగిన పంట పొలాలు

ప్రజాపక్షం/తుంగతుర్తి : మండల పరిధిలో మొంతా తుఫాన్ కారణంగా బుధవారం కురిసిన వర్షానికి చేతికి వచ్చిన పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి. మండల వ్యాప్తంగా వేల ఎకరాల్లో వరిపైరు, వందల ఎకరాల్లో పత్తి పంటను రైతులు నష్టపోయారు. ప్రభుత్వం తగిన నష్టపరిహారం అందించి తమను ఆదుకోవాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఉధృతంగా ప్రవహిస్తున్న చెరువులు, కుంటలు.... రాకపోకలు బంద్

ప్రజాపక్షం/డిండి; మొంథా తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు డిండి మండలంలో జనజీవనం స్తంభించింది. మంగళవారం మధ్యాహ్నం నుండి మొదలైన వర్షం బుధవారం సాయంత్రం వరకు రావడంతో మండలంలోని డిండి ప్రాజెక్టు ఆకాశాన్ని తాకే విధంగా అలుగు పొస్తూ మీటర్ మేర నీరు అలుగు పోయడంతో ప్రజలను భయభ్రంతులకు గురిచేసింది. మండలంలోని లింగమయ్య వాగు రోడ్డుపై నుండి ప్రవహించడంతో బాపన్‌కుంట వద్ద అలుగు పారడంతో డిండి దేవరకొండ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. సింగరాజుపల్లి ప్రాజెక్టు నిండడంతో డిండికి రాకపోకలు నిలిచిపోయాయి. బుధవారం ఉదయం పరిస్థితులను పరిశీలించిన డిండి ఎస్ఐ బాలకృష్ణ సిబ్బందితో కలిసి సంబంధిత ప్రాంతానికి చేరుకొని ప్రజలను అప్రమత్తం చేశారు. దాసరినెమలిపూర్ వాగులో దాసరినెమలిపూర్ తండాకు చెందిన రమావత్ లక్ష్మీపతి అనే రైతు కు చెందిన రెండు ఎడ్లు వాగులో కొట్టుకుపోయి మృతి చెందాయని వాటి విలువు సుమారు 1,70,000 ఉంటుందన్నారు.





ప్రజాపక్షం/నందికొండ: మొంథా తుఫాన్ ప్రభావం కారణంగా కృష్ణా నది ఉధృతంగా ప్రవహిస్తూ ఉండటంతో దానికి తోడు ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తూ ఉండటంతో నదీ ప్రవాహం అలల తాకిడితో మరింత వేగంతో ప్రవహిస్తుంది.దీనితో నదీ తీర ప్రాంతాల్లో వలలు వేసిన మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఒక్కసారిగా పెరిగిన గాలి వర్షానికి అనేక వలలు నీటి ప్రవాహంలో కొట్టుకుపోగా చిన్న పడవలు గల్లంతై పగిలిపోయినట్లు మత్స్యకారుల సంఘం అధ్యక్షులు రమణా తెలిపారు. సాగర్లో గత 24 గంటలలో కురిసిన వర్షానికి 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయిందని కేంద్ర జల సంఘ సిబ్బంది తెలియజేశారు.

ప్రజాపక్షం/డిండి; మొంథా తుఫాను కారణంగా గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో నాగర్ కర్నూల్ , నల్గొండ జిల్లాల్లో కురిసిన వర్షాల కారణంగా డిండి ప్రాజెక్టులోకి భారీ వరద ఎగువ నుండి రావడంతో ప్రాజెక్టు ఉగ్రరూపం దాల్చి డ్యాంపై నుండి మీటర్ ఎత్తులో ప్రవహిస్తూ నీరు బ్రిడ్జిపైకి వచ్చే విధంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో డిండి గ్రామ ప్రజలు ప్రాజెక్టు లోతట్టు పరిసర గ్రామాల ప్రజలు ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని డిండి ప్రాజెక్టు మత్స్యకార సొసైటి చైర్మన్ మేకల కాశన్న సూచించారు. హైదరాబాద్‌శ్రీశైలం జాతీయ రహదారి 765 డిండి ప్రాజెక్టు సమీపంలో రైట్ కెనాల్ బ్రిడ్జి సమీపంలో రోడ్డు వరద ప్రవాహానికి కొంతమేర కుంగిపోవడం జరిగిందని ప్రయాణికులు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

## నీట మునిగిన పత్తి చేలు....

ప్రజాపక్షం/మునుగోడు: రైతన్నలు ఆరుగాలం కష్టపడి పండించిన వరి,పత్తి పంటలు చేతికొచ్చే సమయానికి మొంథా తుఫాన్ శాపంగా మారింది. మండల వ్యాప్తంగా బుధవారం ఎడతెరుపు లేకుండా వర్షం పడడంతో పత్తి చేలు నీట మునిగాయి. వరి పంట అడ్డం పడిపోయింది.దింతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కురిసిన వర్షాలకు పత్తి వరి పంటలకు జరిగిన నష్టాన్ని సంబంధిత శాఖ అధికారులతో పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపోయిన రైతులను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురిజ రామచంద్రం డిమాండ్ చేశారు.

**ఐకేపీ కేంద్రలను పరిశీలించినా అధికారులు...**

మండలంలో ఎడతెరిపు లేకుండా కురుస్తున్న వర్షాలకు ఊకోండి కచలాపురం ఐకెపి సెంటర్లో పోసిన వరి ధాన్యాన్ని చండూరు ఆర్డీవో శ్రీదేవి తాహాసిల్దార్ నరేష్ మండల వ్యవసాయ అధికారి పద్మజ ఆర్ఐ వంశీతో కలిసి పరిశీలించారు.

## డి రాపాక గ్రామంలో వరద తాటికి నీట మునిగిన ఇండ్లు

ప్రజాపక్షం/అడ్డగూడూర్ : మండలంలోని డి రాపాక గ్రామం చెంతనే ఉన్న పోతి రెడ్డికుంట వుప్పొంగడంతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా వరద నీరు ప్రవహించింది. దీంతో హుటాహుటిన గ్రామపంచాయతీ సిబ్బంది స్పందించి రెండు జెసిబిలను తీసుకొని వచ్చి కూడుకుపోయిన కాలువలను మరమ్మత్తు చేస్తున్నా పరిస్థితి. గ్రామంలో కొన్ని ఇండ్లు నీలమునగగా వీధులన్నీ జలమయమైపోయాయి. ముందస్తు చర్యలో భాగంగా అడ్డగూడూరు పోలీసు వారు ఇతర శాఖల సిబ్బందితో గ్రామంలో ఉండి మొత్తం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.






## పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని పాదయాత్ర

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 వ జయంతి ని పురస్కరించుకొని ప్రజలలో జాతీయ సమైక్యతను దేశ భక్తిని పెంపొందించేందుకుగాను, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మై భారత్,ఎన్ఎస్ఎస్ సహకారంతో సర్దార్ 150 యూనిట్ మార్చ్ ను నిర్వహించనున్నట్లు ఎంపీ, రాజ్యసభ సభ సభ్యులు కేసరి దేవ్ సిన్హ జ్వాల తెలిపారు.ఆయన బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నల్లగొండ, సూర్యాపేట జిల్లాల అధికారుల తో కలిసి మీడియా ప్రతినిధులతో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫెరెన్స్ లో మాట్లాడారు. సర్దార్ 150 యూనిటీ మార్చ్ కార్యక్రమంలో భాగంగా జాతీయ సమైక్యత,దేశ భక్తి ని పెంపొందించడం, ప్రత్యేకించి జాతిని ఏకీకృతం చేయడంలో పటేల్ పాత్ర , జాతి నిర్మాణంలో యువతను ప్రోత్సహించడం ద్వారా 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో నవంబర్ 12,13 తేదీలలో పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందని, ఇందుకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయన జిల్లా యంత్రాంగాన్ని కోరారు.డిఆర్ఓ వై.అశోక్ రెడ్డి అడిషనల్ ఎస్పి రమేష్, డిపిఆర్ఓ వెంకటేశ్వర్లు ,జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎం డి అక్బర్ అలీ, జెడ్‌పిసీఈఓ శ్రీనివాసరావు,మెప్మా పిడి శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి ,మై భారత్ ప్రతినిధి కృష్ణ ,సామాజిక కార్యకర్త సురేష్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.అనంతరం గోడపత్రికను ఆవిష్కరించారు.

## నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

### ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై సుప్రీంకోర్టులో జరిగిన దాడికి నిరసనగా నవంబర్ 1వ తేదీన హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అన్నారు. బుధవారం జిల్లా కోర్టులో సీనియర్ న్యాయవాది డప్పు మల్లయ్య ఆధ్వర్యంలో న్యాయవాదులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జస్టిస్ గవాయ్ మహారాష్ట్రలోని మహర్ కులంలో పుట్టి ఆయన ఎంతో కష్టపడి న్యాయవాద వృత్తిని చేపట్టారని అన్నారు. అంచలంచెలుగా ఎదుగుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఆయన పదవి బాధ్యతలు చేపట్టారని అటువంటి వ్యక్తిపై ధర్మం పేరుతో దాడి చేయడం అమానుషమన్నారు. విశ్వాసాల పేరుతో ధర్మం ముసుగులో న్యాయమూర్తిపై దాడి చేస్తే చట్టపరిధిలోకి రాదా అని ఆయన ప్రశ్నించారు. ఆయనపై దాడిని దళితుల ఆత్మ గౌరవంపై జరిగిన దాడిగా తాము భావిస్తున్నామని, భారత రాజ్యాంగంపై జరిగిన దాడిగా భావించాలని ఎమ్మార్పీఎస్ పిలుపునిస్తుందన్నారు. గతంలో అయోధ్య కేసు విషయంలో శ్రీరాముడు అయోధ్యలో ఉన్నాడనడానికి ఆధారాలు ఉన్నాయా అని న్యాయమూర్తి ప్రశ్నించారని గుర్తు చేశారు. పార్లమెంట్ కన్నా భారత రాజ్యాంగం గొప్పదని, రాజ్యాంగ మౌళిక సూత్రాలను పార్లమెంట్ మార్చలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సూర్యాపేట అధ్యక్షులు సుంకర లింగయ్య, సుంకరబోయిన రాజు, దావుల వరప్రసాద్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ షఫివుల్లా, ఫరిదుద్దీన్, నూకల సుదర్శన్ రెడ్డి, వసంత సత్యనారాయణ పిళ్లై, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి సమన్వయకర్త చింతలపాటి చిన్నశ్రీరాములు, ఎంపిఎస్‌పి జిల్లా అధ్యక్షులు యాతాకుల రాజన్న, రెబల్ శ్రీను, ఎర్ర వీరస్వామి పాల్గొన్నారు.



# ఆకాల వర్షం....అపార నష్టం...

## రైతులను నిండా ముంచిన ''మొంథా'' తుపాన్

### నియోజవర్గ వ్యాప్తంగా నీటమునిగిన వేల ఎకరాల వరిపంట

### పంట నష్టం చెల్లించాలి...మాజీ ఎమ్మెల్యే బొల్లం





**ప్రజాపక్షం/కోదాడ:** మొంథా తుఫాన్ ప్రభావంతో గత రెండు రోజులుగా నియోజవర్గ వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలు, గాలిదుమారంతో కొన్ని గ్రామాలలో పంట నీట మునిగిపోగా,మరి కొన్నిగ్రామాలలో పంట నెల రాలిపోయి రైతుకు తీవ్ర నష్టం వాటిల్లడంతో బోరున విలపిస్తున్నారు. ఎకరానికి 20వేల రూపాయలు పెట్టుబడి పెట్టి కంటికి రెప్పలా కాపాడుకుంటు పంట చేతి వచ్చే సమయంలో ''ముథా'' రైతులను నిండా ముంచింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి నష్టపోయిన రైతుకు పరిహారం ఇప్పించాలని రైతులు కోరుతున్నారు. కోదాడ మండల పరిధి తొగర్రాయి గ్రామ దేవాలయం వరద నీటితో మునిగిపోయింది. పట్టణంలోని పలు కాలనీలలో వరద నీటితో ప్రజలు ఇబ్బందులు పడకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గతఏడాది కురిసి కుంభ వృష్టికి నియోజవర్గ వ్యాప్తంగా అనేక గ్రామాలలో పంట నష్టం వాటిల్లింది. అధికారులు పంట నష్టం అంచనావేసి పరిహారం చెల్లిస్తామని నేటి వరకు చెల్లించలేదు. దీంతో పాటుగా నడిగూడెం మండలం సాగర్ కాల్వాకు గండి పడి నడిగూడెం, అనంతగిరి మండలాలలో వందల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం నష్ట పరిహారం చెలించలేదు. ప్రస్తుతం ముథా తుఫాన్‌తో నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి.లేని పక్షంలో తమ పార్టీ అధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళన చేపడతాం.

# సర్దార్ జయంతి సందర్భంగా 150 యూనిటీ మార్చ్




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మై భారత్, ఎన్ఎస్ఎస్ సహకారంతో సర్దార్ 150 యూనిటీ మార్చ్‌ను నిర్వహించనున్నట్లు ఎంపి, రాజ్యసభ సభ్యులు కేసరిదేవ్‌సిన్హ్ జ్వాల తెలిపారు. సర్దార్ 150 యూనిటి మార్చ్ కార్యక్రమం అమలులో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇంచార్జిగా నియమితులైన ఆయన బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నల్లగొండ, సూర్యాపేట జిల్లాల అధికారులతో కలిసి మీడియా ప్రతినిధులతో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. మార్చ్ కార్యక్రమంలో భాగంగా జాతీయ సమైక్యత, దేశభక్తిని పెంపొందించడం, ప్రత్యేకించి జాతిని ఏకీకృతం చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పాత్ర, జాతి నిర్మాణంలో యువతను ప్రోత్సహించడం ద్వారా 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా ఈనెల 31 నుండి నవంబర్ 25 వరకు జిల్లాలలో విడతలవారీగా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. మూడు రోజుల పాదయాత్రను జిల్లాస్థాయిలో నిర్వహించాలని, ప్రతి పాదయాత్ర 8 నుండి 10 కిలోమీటర్లు ఉండేలా చూడాలని, ఈ పాదయాత్రలో కనీసం 500 మంది యువత, విద్యార్థులు పాల్గొనేలా చూడాలని అధికారులతో కోరారు. జిల్లాస్థాయిలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన అధికారులతో కోర్ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇందులో విశ్రాంత ఐఏఎస్ అధికారులు, జిల్లా యువజన సర్వీస్ల అధికారి, ఇతర అధికారులు, ప్రతినిధులతో కోఆర్డినేషన్ కమిటీలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ విషయమై ప్రతివారం జాతీయ స్థాయి కోర్ కమిటి సమీక్షలు నిర్వహిస్తుందని వెల్లడించారు. వైద్యశిబిరాల నిర్వహణ, యోగ క్యాంప్‌లు, ఎగ్జిబిషన్లు, వర్క్‌షాప్‌ల నిర్వహణ, కళాశాల, పాఠశాల విద్యార్థులకు డిబేట్, ఇతర కాంపిటీషన్ల నిర్వహణ, వీధి నాటకాలు, ప్రచారాలు, స్వచ్ఛత కార్యక్రమాలను చేపట్టాలని ఆయన తెలిపారు. ఇందుకు గాను ఆయా జిల్లాల వారీగా రూట్ మ్యాప్‌ను రూపొందించాలన్నారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో నవంబర్ 12, 13 తేదీలలో పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందని, ఇందుకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని కోరారు. ఇదే అంశంపై అదనపు కలెక్టర్ కె సీతారామారావు మాట్లాడుతూ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఎంపి, రాజ్యసభ సభ్యులు కేసరిదేవ్‌సిన్హ్ జ్వాల, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సూర్యాపేట జిల్లాలో సర్దార్ 150 యూనిట్ మార్చ్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, జిల్లా క్రీడల అధికారి వెంకటరెడ్డి, జిల్లా యూత్ అధికారి రాజేష్, జడ్పి సిఈఓ అప్పారావు, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, జిల్లా ఇంటర్మీడియేట్ అధికారి భానునాయక్, డిఎంహెచ్ఓ చంద్రశేఖర్, మున్సిపల్ కమీషనర్ హన్మంతరెడ్డి పాల్గొన్నారు.

## ఢిల్లీ సదస్సుకు బయల్దేరిన చైర్మన్ ఆలకుంట్ల



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రెండు రోజులపాటు ఢిల్లీ లో జరగబోయే ఫార్మర్స్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్ సదస్సు కు నల్లగొండ ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నం రాజు,సీఈఓ కంచర్ల అనంత రెడ్డి లు బయల్దేరారు. ఈ సందర్భంగా చైర్మన్ నాగరత్నం రాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర నందు 5 సొసైటీలు ఈ సదస్సుకు ఎన్నిక కావడం జరిగింది అందులో నల్లగొండ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఎంపిక కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

## ఒకరికి రక్తదానం.. మరొకరికి ప్రాణదానం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఒకరికి రక్తదానం మరొకరికి ప్రాణదానమని డీఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా డీఎస్పీ ఆధ్వర్యంలో బుధవారం ఏరియా ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో పోలీసులు తమ ప్రాణాలను పణంగా పెడుతున్నారని అన్నారు. వీరి సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. విధి నిర్వహణతోపాటు సామాజిక సేవకు ముందుకు వచ్చిన పోలీసులు, యువతను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఐలు నాగభూషణరావు, జెట్టి సోమనరసయ్య, పీఎస్ ప్రసాద్, ఎస్ఐలు సైదిరెడ్డి, రాంబాబు, కృష్ణయ్య, లక్ష్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



## లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** నిషేదిక మావోయిస్టు పార్టీలో పనిచేసి ఇటీవల లొంగిపోయిన ముగ్గురు సభ్యులకు ప్రభుత్వం నుండి మంజూరైన రూ.9 లక్ష 50 వేల నగదును ఎస్‌పి రోహిత్ రాజ్ వారికి అందజేశారు. ఈ రివార్డులను ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాకు చెందిన రామ్‌సింగ్ కొడే, నరోటి మనీష్ రూ.5 లక్షలు, ఊసూరు బ్లాక్ చెందిన ముచ్చిక సోందాల్ రూ.3.75 లక్షలు, చింతగుప్పకు చెందిన మోడి భీమీ అలియాస్ దేవా రూ.75 వేలు చెక్కుల రూపంలో ఎస్‌పి బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ నిషేదిక సిపిఐ మావోయిస్టు పార్టీలో పనిచేస్తూ లొంగిపోయిన వారికి తెలంగాణ ప్రభుత్వం నుండి మంజూరైన రివార్డు నగదులను వారి పునరావాసం కోసం అందజేయడం జరిగిందని తెలిపారు. కాలం చెల్లిన సిద్దాంతాలతో స్వార్ధ ప్రయోజనాల కోసం మావోయిస్టు పార్టీ నాయకులు, అమాయకులైన ఆదివాసీలను బలవంతంగా తమ పార్టీలోకి చేర్చుకునివారి చేత చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేయించారని తెలిపారు. లొంగిపోయిన సభ్యులకు జిల్లా పోలీసులు అండగా ఉంటారన్నారు.ఇంకా మావోయిస్టు పార్టీలో ఉంటూ అజ్ఞాత జీవితాన్ని సాగిస్తూ ఉన్న వారి లొంగిపోయి జనజీవనస్రవంతిలో కలవాలని ఎస్‌పి కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి ఆపరేషన్స్ నరేందర్, ఆర్ఐ ఆపరేషన్స్ రవి పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక తవ్వకాలను చేపట్టవద్దు

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి అటవీ పరిధిలో ఇసుక అక్రమ తవ్వకాలను చేయవద్దని ఆళ్లపల్లి రేంజర్ ఎన్ కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అక్రమంగా ఇసుక రవాణా చేసినందుకు ముందుగా స్వాధీనం చేసుకున్న 8 ట్రాక్టర్లు, వాటి ట్రాలీలను చట్టపరంగా ప్రక్రియలు పూర్తి అయిన తరువాత విడుదల చేయడం జరిగిందన్నారు. ప్రతి ట్రాక్టర్‌పై రూ 44,145 చొప్పున, మొత్తం రూ 3,53,160 లను కాంపౌండింగ్ జరిమానా విధించి, చట్ట ప్రకారం వసూలు చేసిన తరువాతే వాహనాలు విడుదల చేయడం జరిగిందన్నారు. ప్రజలు అక్రమ ఇసుక తవ్వకం లేదా రవాణాలో పాల్గొనవద్దని విజ్ఞప్తి చేయబడుతోందన్నారు. ఉల్లంఘన చేసిన వారి వాహనాలు స్వాధీనం చేయబడతాయని, భారీ జరిమానాలు, చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. భవిష్యత్ తరాల ప్రయోజనార్థం వన్యప్రాణి సంరక్షణ, అటవీ వ్యవస్థల పరిరక్షణలో ప్రజల సహకారం అందించాలన్నారు.

## జోరువాన.. నీట మునిగిన పంట పొలాలు



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** చంద్రుగొండ మండల వ్యాప్తంగా తుఫాన్ కారణంగా జోరువాన కురిసింది. బుధవారం తెల్లవారు ఝాము నుండి నిరంతరాయంగా వాన కురుస్తుండటంతో మండలంలోని ఎదుళ్లవాగు, లంకల వాగు, రావికంపాడు, బాలియ తండా వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. లంకలవాగు చెక్ డ్యాం పొంగి ప్రవహిస్తుంది. పత్తి చేనుల్లో తీయడానికి సిద్ధంగా ఉన్న పత్తి వానకి తడిసిన నేలపాలయింది. ప్రధానంగా పత్తి రైతులకు ఈ వాన వల్ల నష్టం అధికంగా ఉంటుందని రైతులు తెలుపుతున్నారు. మిరప చేనుల్లో సైతం వానకి నీరు చేరడంతో రైతులు వాటిని బయటకు పంపే పనిలో నిమగ్నమైనారు. తుఫాన్ వల్ల మండల రైతులకు నష్టం అధికంగా పోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు.

## మానవత్వం చాటిన మెడికల్ ఆఫీసర్



**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి ప్రభుత్వ హాస్పిటల్‌కు చెందిన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి మానవీయతను చాటారు. వివరాల్లోకి వస్తే ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో రోడ్డుపై టీవీఎస్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి ఆర్టీసీ బస్సు వస్తున్న క్రమంలో తప్పించబోయి కిందపడగా అదే సమయంలో అటుగా వస్తున్న డాక్టర్ సాయి ప్రమాద ఘటనను చూసి వెంటనే ప్రమాద స్థలికి చేరుకొని రోడ్డుపై పడి ఉన్న క్షతగాత్రుల్ని లేని నిల్చోబెట్టి అతని వంటిపై గాయాలను పరిశీలించి, నీకు ఎటువంటి ప్రమాదం లేదు ధైర్యంగా ఉండవని మానసిక స్థైర్యాన్ని అందించారు. ఈ లోపుగా పరిసర ప్రాంతాల నుండి అనేక మంది రోడ్డు ప్రమాద స్థలానికి చేరుకొని బాధితున్ని డాక్టర్ సలహా మేరకు కూసుమంచిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సకు పంపించారు. ఈసందర్భంగా కూసుమంచి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయిని పలువురు అభినందించారు.

## పోడుభూముల జోలికొస్తే సహించేది లేదు



**ప్రజాపక్షం/ దుమ్ముగూడెం:** ఏళ్ల తరబడి సాగులో ఉన్న పోడుభూముల జోలికి వస్తే సహించేది లేదని సిపియం జిల్లా కమిటి సభ్యులు మర్కం చంద్రయ్య హెచ్చరించారు.బుధవారం మండల పరిధిలోని నందులచెలక గ్రామంలో శాఖ జనరల్‌బాడి సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత40ఏళ్లుగా రైతులు పోడుభూముల్లో సాగు చేసుకుంటున్న రైతులపై ఫారెస్టు అధికారులు చేస్తున్నదాడులను ఆయన ఖండించారు. రైతులపై అన్యాయంగా బెదిరింపులకు పాల్పడుతూ వారిపై పోలీసులు కేసులు పెట్టడం సరైన పద్దతికాదని ఫారెస్టుఅధికారులు పద్దతి మార్చుకోని వారిపై దాడులు ఆపాలని హెచ్చరించారు.అటవి హక్కులచట్టం ప్రకారం సాగులో ఉన్న రైతులకు పట్టాలివ్వాలిని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సోయంకృష్ణ, సోయంచిట్టిబాబు,ముద్దరాజు,వర్సా సీతమ్మ, తెల్లం తిరుపతి రావు,బాపనయ్య,నాగేశ్వరరావు,వజ్రమ్మ,తదితరులు పాల్గొన్నారు.

# న్యాయ వ్యవస్థ పరిరక్షణకు హైదరాబాద్‌లో ర్యాలీ




**-రాజ్యాంగాన్ని గౌరవించని వారు దేశ ద్రోహులే**
**-మీడియా సమావేశంలో మంద కృష్ణమాదిగ**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారతదేశంలో న్యాయ వ్యవస్థ రాజ్యాంగ పరిరక్షణ కొరకు నవంబర్ ఒకటిన దళితులచే హైదరాబాద్‌లో ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ తెలిపారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో దళితులపై ఇప్పటికీ వివక్ష, అంటరానితనం, దాడులు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. దేశంలో అత్యున్నత వ్యవస్థ సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ దళితుడైన గవాయ్ మీదనే బూటుతో దాడి జరిగిందని ఆయన తెలిపారు. ఈ సంఘటనకు దేశం నివ్వెర పోగా ఇప్పటికీ వారాలు గడిచినా సుమోటోగా కేసు నమోదు కాకపోవడం పోలీసులు మౌనంగా ఉండటం శోచనీయమన్నారు. కనీస మానవ హక్కుల కమిషన్ సైతం స్పందించ లేదని ఈ ఘటనే దళితులకు రక్షణ లేదని స్పష్టంగా రుజువు చేస్తుందన్నారు. పైగా మేము మళ్లి దాడులు చేస్తామని సోషల్ మీడియా ద్వారా హెచ్చరిస్తుండటం దేనికి సంకేతమని కృష్ణమాదిగ ప్రశ్నించారు. ఛత్తీస్ గఢ్‌లో న్యాయమూర్తిని అవమానించారని కేసు నమోదు చేసిన వారికి చీఫ్ జస్టిస్ పై దాడి కనపడటం లేదా అన్నారు. నవంబర్ ఒకటిన ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో ఎక్కడ జరగని రీతిలో ర్యాలీ జరగనుందని ఆయన తెలిపారు. మీడియా సమావేశంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు విజయ్ మాదిగ, అంజయ్య మాదిగ, సునీల్ మాదిగ, నాగరాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# మధిర మండలంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం



**ప్రజాపక్షం/ మధిర :** బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాన్ తీవ్రత మధిర మండలంలో పూర్తిగా కనిపించింది. మంగళవారం రాత్రి నుండి బుధవారం మధ్యాహ్నం వరకు ఏకధాటిగా వర్షం కురవడంతో గ్రామాలన్ని అస్తవ్యస్తంగా మారడంతో గ్రామాల ప్రజలు ఇండ్లకే పరిమితమయ్యారు. మండలంలో విస్తారంగా కురిసిన వర్షాలతో పంట పొలాలు నీట మునిగి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి రైతులు ఇప్పటికే అధిక వర్షాలతో దిగుబడి రాక ఆందోళన చెందే క్రమంలో ఈ తుఫాన్ మరింత ప్రభావం చూపించింది. మండలంలోని పత్తి, వరి, మిర్చి, మొక్కజొన్న తదితర పంటలకు తుఫాన్ ప్రభావంతో తీవ్ర నష్ట వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన పంటలకు నష్టపరిహారం అందించాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. మధిరలో కురిసిన భారీ వర్షం కారణంగా 2వ వార్డు ముస్లిం కాలనీ వరదనీటితో నీట మునగటంతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తూ రోడ్డెక్కారు. సిపిఎం ఆధ్వర్యంలో కాలనీవాసులు మధిర వైరా ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో అధికారులు అక్కడికి చేరుకుని సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చి ఆందోళనను విరమింపచేశారు. అనంతరం ముస్లింకాలనీలో వరద నీటి బయటకు తీసేందుకు మున్సిపల్ కమీషనర్ సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో యుద్ద ప్రతిపాదికన కాల్వ పనులు చేపట్టారు. మధిర పట్టణంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో జనజీవనం స్తంభించిపోయింది.

# ఎడతెరిపి లేని వర్షం.. స్తంభించిన జనజీవనం






**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** మొంథా తుపాన్ తీవ్రత తిరుమలాయపాలెం మండలంలో పూర్తిగా కన్పించింది. బుధవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో మండలంలోని గ్రామాలన్ని అస్త వ్యస్తంగా మారాయి. దీంతో గ్రామల ప్రజలు ఇండ్లకే పరిమితయ్యారు. మండలంలోని పిండిప్రోలు, తిరుమలాయపాలెం, కొక్కిరేణి, ఎర్రగడ్డ, తాళ్ళ చెరువు, దమ్మాయిగూడెం గ్రామాల్లో ఎక్కువగా మిర్చి పత్తి పంటుసాగు చేయగా బీరోలు, జూపెడ, బచ్చోడు, కాకరవాయి, హస్నాబాద్ , రఘునాధపాలెం, సుబ్లేడు, తదితర గ్రామాల్లో ఎక్కువగా వరి పంటలు సాగు చేశారు. ఈ తుఫాన్ ప్రభావం అన్ని పంటలపై పడిందని, వరి పొలాలకు కోతకు వచ్చే సమయంలో అకాల వర్షం అపార నష్టాన్ని మిగిలిచిందని రెతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో చెరువులు, అలుగులు పోయడంతో రాకపోకలకు అంతరాయమేర్పడింది. తిరుమలాయపాలెం గ్రామంలో ఇండ్లలోకి వర్షపునీరు చేరడంతో తహాశీల్దార్ లూథర్ విల్సన్, ఎంపిడిఓ ఎస్కె సిలార్‌సాహెబ్, ఎంపిఓ ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి సుజాత జెసిబి సహాయంతో ఇండ్లలో చేరిన వర్షపు నీటిని తొలగించారు. కొక్కిరేణి గ్రామంలో ప్రధాన రహదారిపై చెరువునీరు చేరడంతో పంచాయతీ కార్యదర్శి భవ్య జెసిబి సహాయంతో కాలువ తీయించి వర్షపు నీటిని మళ్లించారు. ఆకేరు వెంట ఉన్న గ్రామాల ప్రజలకు అక్కడ పంచాయతీ కార్యదర్శులు ప్రజలను అప్రమత్తం చేశారు. ఏరు పెరిగినట్లయితే వెంటనే పునరావాస కేంద్రాలకు, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గత సంవత్సరం సెప్టెంబర్‌లో జరిగిన నష్టాన్ని మళ్లీ పునరావృతం కాకుండా చూసుకోవాలని తెలిపారు.

# మొంథా తుపాన్‌తో నీట మునిగిన వరి పంట



**ప్రజాపక్షం/కల్లూరుః** మెంథో తుఫానుకు మండల పరిధిలోని కప్పల బంధం, కల్లూరు, రఘునాథ బంజర తదితర గ్రామాలలో సుమారుగా 100 ఎకరాలలో వరి పంట నీట మునిగినట్లు వ్యవసాయ శాఖ అధికారిని రూప తెలిపారు. గత మూడు రోజులుగా కురుస్తున్న మెంథో తుఫాను వలన 100 ఎకరాలలో 50 మంది రైతులు నష్టపోయారని ఆమె తెలిపారు. ఒక ఎకరం 25000 పెట్టుబడితో పంటను కొనసాగించామని దీనివలన మరో రెండు రోజులు వర్షం పడితే పూర్తిగా నష్ట పోయే అవకాశం ఉందని, కావున రైతులు కాలిబాటను పంట పొలంలో ఏర్పాటు చేసుకొని నీటిని బయటికి పంపించేయాలని ఆమె రైతులకు సూచించారు. దీనికి గాను వ్యవసాయ శాఖ అధికారిని సంప్రదించాలని ఆమె రైతులకు వివరించారు. పంట చేతికందే దిశలో ఈ విధంగా ఒకేసారి భారీ వర్షం ఈదురుగాలులతో రావడం వలన సొంతం, కౌలు పొలాలు పంట ఈ విధంగా నేల వాలడం వలన రైతులు ఆందోళనలో ఉన్నారు. అదే విధంగా పత్తి పంట కూడా అధిక వర్షాలతో రైతులు కూడా అదేవిధంగా ఉన్నారని ఏవో తెలిపారు. పత్తి పంట కూడా చిన్న కోరుకొండి, పెద్ద కోరుకొండి, చెన్నూరు, మర్లపాడు, తెలగవరం, పోచవరం, టి. వెంకటాపురం తదితర గ్రామాలలో పత్తి పంట చేతికందే దశలో అధిక వర్షాల వలన అష్ట కష్టాలు పడాల్సి వస్తుందని కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితులు లేదని రైతులు తెలుపుతున్నారు.

# వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి : సిపి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** గత రెండురోజులుగు కురుస్తున్న భారీవర్షాలకు వచ్చే వరదలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమీషనర్ సునీల్‌దత్ సూచించారు. బుధవారం మండల పరిదిలోని తీగలబంజర వద్ద గల పగిడేరు వరద ప్రవాహాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు మండల పరిదిలోని అంజనాపురం వద్ద నిమ్మవాగులో డిసిఎం వ్యాన్ పడిపోవడంతో స్థానిక పోలీసులు ఎన్డీఆర్‌ఎఫ్ బృందాన్ని అప్రమత్తం చేశారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, ఏర్లు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని నీటమునిగి రోడ్లను దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. ఎగువప్రాంతాల్లో అధిక వర్షాల కారణంగా మున్నేరు వరద ఉధృతి పెరిగే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులను అప్రమత్తం చేశామని తెలిపారు. ప్రజలుకూడా అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. అత్యవసరమైన పనిఉంటే తప్ప ప్రజలు ఇంటినుంచి బయటకు రావద్దని తెలిపారు.

# చాంబర్ ఎన్నికలకు 118 నామినేషన్లు దాఖలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలకు సంబంధించి 76 పదవులకు 118 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి పిబి శ్రీరాములు తెలిపారు. బుధవారం చివరి రోజు 37 నామినేషన్లు దాఖలైనట్లు ఆయన తెలిపారు. చాంబర్ అధ్యక్ష పదవికి నాలుగు, ప్రధాన కార్యదర్శి పదవికి రెండు, ఉపాధ్యక్ష పదవికి రెండు, సహయ కార్యదర్శి పదవికి రెండు, కోశాధ్యక్షుని పదవికి మూడు, సెంట్రల్ ఈసి పదవికి 10, మిగిలిన శాఖలకు సంబంధించి 95 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. చివరి రోజు మేళ్లచెరువు వెంకటేశ్వరరావు ప్యానెల్‌కు సంబంధించి అధ్యక్షునిగా మేళ్లచెరువు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా జివై నరేష్, కోశాధ్యక్షులుగా తల్లాడ రమేష్ లతో పాటుఈసి మెంబర్లు, వివిధ శాఖల అధ్యక్ష,కార్యదర్శుల పదవులకు నామినేషన్లు దాఖలు చేశారు.

# పునరావాస కేంద్రాలకు తరలింపు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** భారీ వర్షాల నేపథ్యంలో ఖమ్మం మున్నేరు పరివాహక ప్రాంతంలోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. మొంథా తుఫాన్ కారణంగా మంగళవారం అర్థరాత్రి నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా ఖమ్మం నగరంలోని మున్నేరు నది 19 అడుగులు చేరింది. పైనుంచి వరదలు రావడంతో మరింత పెరిగే అవకాశం ఉండడంతో ఖమ్మం కార్పోరేషన్, రెవెన్యూ, పోలీస్ అధికారులను ముంపు ప్రాంత బాధితులను అప్రమత్తం చేస్తూ పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# ముంపు ప్రాంతాల్లో మేయర్ నీరజ పర్యటన



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మేయర్ పునుకొల్లు నీరజ పర్యటించారు. బుధవారం నగరంలోని 11, 50 డివిజన్లలో మేయర్ పర్యటించా రు. మొంథా తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డ్రైనేజీలు నిండి రోడ్లపైకి నీరు, కవిరాజ్ నగర్ ప్రాంతంలో ఇండ్లలోకి నీరు చేరింది. అదేవిధంగా రాపర్తి నగర్, పెట్రోల్ బంక్ ప్రాంతంలో ప్రధాన రహదారిపైకి నీరు చేరి వాహనదారులు పలు ఇబ్బందులు పడ్డారు. మేయర్ ఆయా ప్రాంతాలను పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. జేసిబిల సాయంతో డ్రైనేజీలపై ఉన్న ర్యాంపులు తొలగించి కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ అనిల్ కుమార్, కార్పొరేటర్ రాపర్తి శరత్, నాయకులు సరిపూడి సతీష్, ఈఈ కృష్ణలాల్, హార్టికల్చర్ ఆఫీసర్ రాధిక, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లంకాసాగర్ ప్రాజెక్టు సందర్శన



**ప్రజాపక్షం/పెనుబల్లిః** పెనుబల్లి మండల పరిధిలోని లంకాసాగర్ ప్రాజెక్ట్‌ను సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, తహాశీల్దార్ శ్రీనివాస్ యాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ప్రాంగణంలో సమగ్ర ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ పరిసర ప్రాంతాల్లోని వరద పరిస్థితులు, నీటి నిల్వ స్థాయిలు, ప్రవాహ నియంత్రణ వ్యవస్థలు, అలాగే భవిష్యత్తులో తీసుకోవలసిన జాగ్రత్త చర్యలను విపులంగా విశ్లేషించారు. ఈ కార్యక్రమంలో ఇతర అధికారులు పాల్గొన్నారు.

# లొంగిపోయిన 51 మంది మావోయిస్టులు

**ప్రజాపక్షం/భద్రాచలం :** మావోయిస్టులకు మరో ఎదురు దెబ్బ తగిలింది. ఆ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో ఆయుధాలతో పాటు 51 మంది మావోయిస్టులు పోలీసులు ఎదుట లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో 42 మంది పురుషులు ఉండగా, 8 మంది మహిళా మావోయిస్టులు ఉన్నారు. వీరందరిపై కలిపి మొత్తం రూ.66 లక్షల రివార్డు ఉన్నట్లు ఆరాష్ట్ర పోలీస్ వర్గాలు తెలిపాయి. వరుస లొంగుబాట్లతో మావోయిస్టు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతోంది. ఇటీవల కాలంలో కేంద్ర కమిటీ సభ్యులతో పాటు పలు క్యాడర్లకు చెందిన మావోయిస్టులు లొంగుబాట పట్టారు.